
సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం । 25 । మార్చి । 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34
(సోమవారం సాయంత్రం)

సహర్ 4-54
(మంగళవారం తెల్లవారుజామున)



ఆలయానికి దారేది?

అలంపూర్‌లోని నవబ్రహ్మ ఆలయాలు సహజ నిర్మాణ శైలిని కోల్పోతున్నాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.2 /27.4

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: ఎస్సీ నిరుద్యోగ **అభ్యర్థులకు** గ్రూప్స్ పోటీ పరీక్షల 3నెలల **ఉచిత శిక్షణకు** దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు **జిల్లా షెడ్యూల్** కులాల అభివృద్ధి శాఖ **అధికారిణి శ్వేతా** ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30బ్యాక్‌లాగ్ సీట్లకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని మొదటి రైల్వేగేటు నందు గల బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981488878 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

జోగులాంబ సన్నిధిలో అటవీశాఖ అధికారులు



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆదివారం జోగుళాంబ సర్కిల్ చీఫ్ కన్జర్వేషన్ ఫారెస్ట్ ఆఫీసర్ క్షితిజా, వనపర్తి, గద్వాల జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ కుమార్, గద్వాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వీ.దేవరాజ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

ఆలయంలో కన్జ్యూమర్ ఫోరం జడ్జి

అలాగే, స్వామి వారి ఆలయాలను అనంతపూర్ కన్జ్యూమర్ ఫోరమ్ జడ్జి శ్రీలత దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వామివారి ఆలయంలో ఏకవార రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేయించారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎర్రవల్లిచౌరస్తా: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీఎస్పీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.జి కృష్ణ అన్నారు. ఆదివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండల స్థాయి నుండి వార్డు స్థాయి వరకు పూర్తి స్థాయిలో వెంటనే కమిటీలను వేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎస్పీ పార్టీ, మహానీయుల సిద్ధాంతాలను గురించి తెలియజేస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు తమ ఓటు యొక్క ప్రాధాన్యతపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్, నాయకులు రాంబాబు, సవరన్న, నర్సింహులు, నాగరాజు, వినోద్‌కుమార్, బాస్కర్, సికిందర్, బీసన్న, బొజ్జన్న, తదితరులు ఉన్నారు.

విద్యాహక్కుల కోసం పోరాడాలి

గద్వాల అర్బన్: విద్యాహక్కుల సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, న్యాయవాది మధుసూదన్‌బాబు, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకులు మతాల పేరుతో గద్దెనెక్కి విద్వేశ రాజకీయాలను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రైవేటు విదేశీ విద్యావిధానాలను తీసుకోవడమంటే దేశంలో విద్య ప్రైవేటు తప్ప ప్రభుత్వంలో ఉండకూడదనే ఉద్దేశం కన్పిస్తుందని విమర్శించారు. విద్యార్థులు శాస్త్రీయ, వైజ్ఞానిక, రాజకీయ ఆలోచనలతో పాటు విద్యాహక్కుల సాధనకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్‌జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పేరు కృష్ణ, నాయకులు మహేష్, హనుమేష్, నరేష్, వెంకటేష్, శ్రావణి, రజిత తదితరులు ఉన్నారు.



ఎవరిదారి వారిదే..!

గద్వాల కాంగ్రెస్‌లో ముదురుతున్న వర్గ విభేదాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ వర్సెస్ బండ్ల చంద్రశేఖర్‌రెడ్డిగా మారిన వైనం
- మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల చేరికలో కనిపించని బండ్ల వర్గం
- అధికారుల బదిలీల్లో ప్రాధాన్యత కల్పించకపోవడంపై అసంతృప్తి
- మూణ్ణాళ్ల ముచ్చటగానే నేతల ఐక్యత



జెడ్పీచైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మున్సిపల్ చైర్మన్ కేశవ్, కౌన్సిలర్లు..

గద్వాల రూరల్: నాడు ఇద్దరు నేతలు కూడా బీఆర్ఎస్ పార్టీలో కీలకపాత్ర పోషించినవారే.. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఏకపక్ష ధోరణితో తమను అడుగడుగునా అవమానాలు, అణచివేతకు గురిచేస్తున్నారని పలు సందర్భాల్లో బాహాటంగానే చెప్పుకున్నారు. ఇద్దరు అసెంబ్లీ ఎన్నికల ముందు ఒకేతాటిపైకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గద్వాలలో బంగ్లా ఆదిపత్య రాజకీయాలకు చరమగీతం పాడతామని శపథం చేశారు. గతంలో ఎన్నడూ లేనితరహాలో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగింది. ఇక్కడి వరకు ఐక్యంగా బంగ్లా నాయకులను 'ఢీ' కొట్టిన ఇద్దరు నాయకులు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరిదారి వారిదే అన్నరీతిలో వెళ్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల వరకు భాయి భాయి అని కలిపిన నేతల చేతులు.. నేడు ఒకరిపై మరొకరు ఆదిపత్యం కోసం తలపడుతుండడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. గతంలో ఒకే వేదికపై కనిపించిన వారు నేడు వేరు వేరుగా వేదికలను పంచుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తుండడం చర్చనీయంశంగా మారింది. వారే జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి.

తెరమీదకు బీసీ నినాదం

ఇద్దరు నేతలు కూడా తిరుగుబాటు చేయడంతో అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న గద్వాల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గద్వాల రాజకీయాల్లో సుదీర్ఘ ప్రస్థానం ఉన్న డీకే బంగ్లా, మరోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో అసెంబ్లీ ఎన్నికల్లో తలపడేందుకు సిద్ధమయ్యారు. వీరిని ఢీకొట్టాలంటే ఎన్నికల్లో ప్రత్యేక వ్యూహం అవసరమని 'బీసీ నినాదాన్ని' తెరమీదకు తీసుకొచ్చారు. బంగ్లా రాజకీయాల కారణంగా



కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిని కలిసిన బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి

నాడు ఐక్యంగా తిరుగుబాటు

అసెంబ్లీ ఎన్నికల ముందు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతలుగా కొనసాగారు. పార్టీలో వీరికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అడుగడుగునా అడ్డంకులు సృష్టిసూ పార్టీని వదిలేలా పొమ్మనలేక పొగపెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇరువురు నేతలు పలు సందర్భాల్లో బాహటంగానే ఎమ్మెల్యేపై ఆరోపణలు గుప్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఇద్దరు కూడా బాధితులుగా మారారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై తిరుగుబావుటా ఎగురవేసి అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇరువురూ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దశాబ్దాలుగా బలహీనవర్గాలకు అన్యాయం జరుగుతూనే ఉందని న్యాయం జరగాలంటే బంగ్లా రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన అవసరముందని ఈ ఎన్నికల్లో బీసీ వర్సెస్, రెడ్డిస్ ఉంటాయని జోరుగా ప్రచారం చేశారు.

వేర్వేరుగా చేరికలు, కార్యక్రమాలు..

ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరికలు, కార్యక్రమాల్లో ఇరు వర్గాల నేతల మధ్య వైరుధ్యాలు బహిర్గతమయ్యాయి. ముఖ్యంగా గద్వాల మున్సిపాలిటీ చైర్మన్ బీఎస్ కేశవ్, మరో 16 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విధితమే. వీరిందరు కూడా జెడ్పీచైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి కనిపించకపోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. తాజాగా శనివారం బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి మాజీ జెడ్పీ చైర్మన్ భాస్కర్, ధరూరు ఎంపీపీ మున్నీసాబేగం, సీనియర్ నాయకుడు కౌన్సిలర్ శంకర్, మరికొంత మంది ఎంపీటీసీలు, నాయకులతో కలిసి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిని ప్రత్యేకంగా కలవడం, ఇక్కడ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత లేకపోవడంపై కూడా మరోసారి చర్చకు తావిచ్చింది. కాంగ్రెస్ పార్టీలో ఇరునేతల మధ్య నెలకొన్న వర్గవిభేదాలు టీ కప్పులో తుఫాను మాదిరిగా ముగుస్తాయా..? లేక గతంలో బీఆర్ఎస్‌లో కొనసాగిన మాదిరి ఆధిపత్యపోరుకు దారి తీస్తాయా..? అన్నది వేచిచూడాలి.

ఎలాంటి విభేదాలు లేవు

గద్వాల మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాలి అనుకున్నారు. సీఎం అందుబాటులో లేకపోవడంతో అకస్మాత్తుగా మంత్రి జూపల్లి సమక్షంలో చేరడం జరిగింది. నేను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నందున అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్తున్నాను. మా మధ్య ఎలాంటి విభేదాలు, వర్గాలు లేవు. – సరిత, జెడ్పీచైర్‌పర్సన్

బీసీ నినాదంతో ఇద్దరు నేతలు కూడా గద్వాల రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించించారనే చెప్పవచ్చు. అయితే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మూడు నెలలకే వీరి మధ్య ఉన్న ఐకమత్యం విభేదాలుగా మారి వారి ఆధిపత్యంగా తయారయ్యాయి. దీంతో వీరిమధ్య ఉన్న ఐక్యత మూణ్ణెళ్ల ముచ్చటే అన్న రీతిలో రెండు వర్గాలుగా చీలిపోయారనే ప్రచారం వినిపిస్తుంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గద్వాలలో అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారుల బదిలీ ప్రక్రియ మొదలైంది. ఇక్కడే ఇరువురు నేతల మధ్య అభిప్రాయబేధాలకు బీజం పడిందనే ప్రచారం ఉంది. ముఖ్యంగా పోలీసుశాఖలో ఓ డివిజనల్ అధికారి బదిలీ, అదే

మూణ్ణెళ్ల ముచ్చటగానే..

విధంగా సర్కిల్ అధికారుల బదిలీలపై ఇరువురు నేతల మధ్య విభేదాలు పొడచూపాయని గుసగుసలు వినిపించాయి. అధికారుల నియామకాలు కేవలం కులం ప్రాతిపదికనే నియమిచుకుంటూ వెళితే పార్టీకి చెడ్డపేరు వస్తుందని, రాజకీయంగా కూడా ఇబ్బందులు ఏర్పడతాయని ఇరువురు నేతల మధ్య తీవ్రస్థాయిలో చర్చ జరిగినట్లు అప్పట్లో జోరుగా వినిపించిన ప్రచారం. అదేవిధంగా ఓ నియోజకవర్గ నామినేటెడ్ స్థాయి పోస్టు రిజర్వేషన్ వ్యవహారంలో కూడా ఇద్దరి నేతల మధ్య దూరాన్ని మరింత పెంచిందని సమాచారం. గద్వాల ప్రాంతానికి కొత్త అయినప్పటికీ తనకున్న పరిచయాలతో వీరిని భుజానేసుకుని రాజకీయంగా గట్టిపునాది వేస్తే తన మాటను బేఖాతారు చేస్తుండడం పట్ల సదరు నేత తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని పలువురి ద్వారా తెలుస్తుంది. ఈకారణంగానే గత కొంతకాలంగా దూరంగా ఉంటున్నారనే ప్రచారం సాగుతుంది. ఇదిలా ఉండగా మరోవైపు పార్టీలో తామే ముఖ్య నేతలమని, తాము ఎన్నికల్లో పోటీ చేసి సొంత ఆస్తులను అమ్ముకుని పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చుపెట్టడమే కాకుండా రాజకీయంగా అన్ని రకాల త్యాగాలు చేశామని మరోనేత అంతర్గత చర్చలలో చెబుతుండడం గమనార్హం. మొత్తంగా ఇరువురు నేతల మధ్య అంతరం పెరిగిందని పార్టీ నేతలే చర్చించుకుంటుండడం విశేషం.

ఎంఐఎం ఆధ్వర్యంలో ఇఫ్తారు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎంఐఎం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మర్దాన్‌అలీషా దర్గా పీఠాధిపతి సయ్యద్ రజాక్‌షా ఖాద్రీ, మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ ప్రత్యేక దువా చేశారు. ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తారు విందులో పాల్గొన్న ఓవైసీకి ఎమ్మెల్యే యెన్నం, వంశీచంద్‌రెడ్డి ఖజూర్ తినిపించారు.



ఇఫ్తారులో పాల్గొన్న అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే యెన్నం, వంశీచంద్‌రెడ్డి, కొత్వాల్ తదితరులు

చిరుతల సందడి

అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో 173 చిరుతలు

- కొల్లాపూర్, దోమలపెంట ప్రాంతాల్లో అధిక సంచారం
- నల్లమలలో సంతానోత్పత్తికి అనువైన వాతావరణం
- కలిసొచ్చిన శాకాహార జంతువుల పెరుగుదల
- దేశవ్యాప్త గణాంకాల ఎన్‌టీసీఏ నివేదికలో వెల్లడి



నల్లమలలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన సాసర్ వద్ద నీరు తాగుతున్న చిరుతలు (ఫైల్)

అచ్చంపేట: నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు (ఏటీఆర్) పరిధిలో చిరుతల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వీటి సంఖ్య తగ్గుముఖం పట్టినప్పటికీ.. అమ్రాబాద్ అభయారణ్యంలో మాత్రం పెరగడం గమనార్హం. దేశవ్యాప్తంగా చిరుతల గణాంకాల నివేదికను నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఏటీఆర్‌లో 2018లో 160గా ఉన్న చిరుతలు 2022 నాటికి 173కు చేరినట్లు నివేదికలో వెల్లడించింది. అయితే తెలంగాణ వ్యాప్తంగా 2018లో 334 చిరుతలు ఉండగా.. 2022 నాటికి వాటి సంఖ్య 297కు తగ్గింది. రిజర్వు అభయారణ్యం, పులుల అభయారణ్య ప్రాంతాల వారీగా అడవులను విభజించి, రిజర్వు ఫారెస్టులో నాలుగేళ్లకోసారి మాత్రమే పులుల గణన చేపడుతారు. ఈ క్రమంలో ఏడాదికాలంగా కొల్లాపూర్ ప్రాంతంలోని సోమశిల, మన్ననూర్, దోమలపెంట, లింగాల ప్రాంతాల్లో చిరుతల సంచారం అధికంగా కనిపిస్తోంది.

అనువైన వాతావరణం

అమ్రాబాద్ టైగర్ రిజర్వులో చిరుతలకు అనువైన వాతావరణం, మెరుగైన పరిరక్షణ, సంరక్షణ పద్ధతులు ఉన్నాయి. చిరుతలతోపాటు వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. నిరంతర పర్యవేక్షణ దేశంలోని టైగర్ రిజర్వుల పరిధిలో పులులు, చిరుతల నివాస సామర్థ్యాన్ని పెంచడం, అందుకు అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవడం, కాలుష్య నియంత్రణ, వృక్షజాతులు, నీటి సంరక్షణ, ఫైర్ మేనేజ్‌మెంట్, వన్యప్రాణుల ఆరోగ్యం కోసం మౌళిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఎన్‌టీసీఏ, వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది.

అతిపెద్ద టైగర్ రిజర్వు

నల్లమల అభయారణ్య ప్రాంతం 2,611.39 చదరపు కి.మీ.,లో విస్తరించి ఉండగా.. ఇందులో 2,166,37 చదరపు కి.మీ., అభయాణ్యంగా కాగా 445.02 చదరపు కి.మీ., బఫర్ జోన్‌గా ఉంది. దేశంలోనే రెండో అతిపెద్ద టైగర్ రిజర్వుగా ఇది నిలిచింది. అడవుల్లో జీవవైవిధ్యం పెంపొందించడానికి పెద్దపులులు, చిరుతలే కీలకం. ఈ క్రమంలోనే ఏటేటా పులులు, చిరుతల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడ సుమారు 400 వరకు చిరుతలు, 200 పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా అభయారణ్యం ఉందని అధికారులు చెబుతున్నారు. సంతానోత్పత్తికి అనుకూలమైన అడవి ఉండటంతో చిరుతల సంఖ్య పెరిగిందని అటవీ అధికారులు చెబుతున్నారు. సంతానోత్పత్తి సమయంలో ప్రతిఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలల పాటు పర్యాటకులు, ఇతరులు ఎవరిని అడవిలోకి అనుమతించడం లేదు. వన్యప్రాణుల సంరక్షణ కోసం నిరంతర పర్యవేక్షణే కాకుండా అటవీ సమీప గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం, గడ్డి క్షేత్రాల పెంపకం, తాగునీటి వసతి, సోలార్ పంపులతో చెలిమలు, కుంటల తవ్వకం, సాసర్లను ఏర్పాటు చేస్తున్నారు.



వేటను పూర్తిస్థాయిలో కట్టడి చేయడంతోపాటు స్థానిక ప్రజల్లో పులులు, చిరుతల ఆవశ్యకతపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తోంది. తద్వారా వన్యప్రాణుల సంరక్షణ కోసం స్థానిక ప్రజల మద్దతు పొందుతున్నారు. వన్యప్రాణులకు అవసరమైన ఆహారం అందించేందుకు ప్రత్యేకంగా 300 ఎకరాల్లో గడ్డి పెంచుతున్నారు.

సంరక్షణకు ప్రత్యేక చర్యలు



నల్లమలలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అటవీ సిబ్బంది సంఖ్య పెంచుతూ.. అడవిలోకి పశువులు, మేకలు, గొర్రెల మందల సంచారాన్ని నివారిస్తున్నాం. శాకాహార జంతువుల సంఖ్య పెరగడం వల్లనే చిరుతల సంఖ్య పెరిగింది. ఏటీఆర్‌లో త్వరలోనే ప్రొటెక్షన్ వ్యాన్‌ను అందుబాటులోకి తెచ్చి గాయపడిన వాటికి చికిత్స అందిస్తాం. వన్యప్రాణులకు నీటి వసతి కల్పిస్తూ నీటి ఎద్దడి లేకుండా చూస్తున్నాం. – రోహిత్ గోపిడీ, డీఎఫ్‌ఓ

రమణీయం.. రంగనాథుడి రథోత్సవం



శ్రీరంగాపురం రంగనాథస్వామి రథోత్సవం అశేష జనవాహిని మధ్య అత్యంత వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి రథంపై కొలువుదీరగా సంస్థానాధీశుడు రాజా కృష్ణదేవరావు కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు.

– పెబ్బేరు రూరల్

వివరాలు 10లో..

ప్రతిపక్షాలను ఈడీతో దెబ్బతిసే ప్రయత్నం

అలంపూర్: కేంద్రంలో మూడో సారి అధికారం దక్కించుకోవడానికి బీజేపీ ఈడీ, సీబీఐలతో ప్రతి పక్ష పార్టీలను దెబ్బతియడానికే ప్రయత్నిస్తుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు, నరసింహ విమర్శించారు.. అలంపూర్‌లోని కేవీపీఎస్ కార్యాలయంలో సీపీఎం కమిటి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రతిపక్ష పార్టీలను దెబ్బ తీయడానికి ఈడీ, సీబీఐలను ఉపయోగిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రతి పక్ష నేతలను స్కాముల పేరుతో అరెస్ట్ చేసి వారిని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను లిక్కర్ స్కాంలో అరెస్టు చేయడం దారుణమని, సరైన ఆధారాలు లేకుండా అరెస్టులు చేయడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల వేళ అధికార పార్టీకి ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో వందల వేల కోట్లు రూపాయలు లబ్ధి పొందిందన్నారు. కానీ ప్రతి పక్ష పార్టీల ఎలక్ట్రో రల్ బాండ్లను సీజ్ చేసి ఆ పార్టీలను ఆర్థికంగా దెబ్బతిసే కుట్రలు చేస్తోందన్నారు. దేశంలో మతం మత్తులో ప్రజలను మభ్యపెట్టి ఓట్లను దండుకుని అధికారంలోకి రావడానికి చూస్తోందని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు

వైభవంగా ధ్వజారోహణం

- మన్యంకొండలో కనులపండువగా తిరుచ్చి సేవ
- నేడు అలివేలుమంగ తిరుకల్యాణ మహోత్సవం



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీఅలివేలు మంగతాయారు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా దేవస్థానం సమీపంలో ఉన్న పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆ మట్టిని తీసుకువచ్చి దేవస్థానం పక్కనున్న మండపంలో సంప్రదాయబద్ధంగా పురోహితుల వేదమంత్రాల మధ్య హోమం జరిపించారు. అనంతరం దేవస్థానం ముందున్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణ, అలాగే అమ్మవారి సన్నిధిలో దేవతాహ్వానం, బలిహరణం, ఎదుర్కోలు తదితర పూజలు చేశారు.

ఘనంగా తిరుచ్చిసేవ..

ఉత్సవాల్లో భాగంగా దేవస్థానంలో ఆదివారం రాత్రి తిరుచ్చి సేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన అమ్మవారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మంటపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య సేవ ముందుకు కదిలింది. భక్తుల హరినామస్మరణతో సేవా ప్రాంతం మారుమోగింది. వివిధ రకాల పూలు, బంగారు ఆభరణాల అలంకరణలో అమ్మవారు సేవలో దేవస్థానం పరిసరాల్లో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

⇨ మన్యంకొండ శ్రీఅలివేలు మంగతాయారు ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది హోలి పండుగ రోజు ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా దేవస్థానం వద్ద తిరుకల్యాణ మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

శాంతియుతంగా హోలీ నిర్వహించుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రజలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా హోలీ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఇటిక్యాల, కోదండాపురం ఎస్ఐలు వెంకటేష్, స్వాతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, చెరువుల్లో స్నానం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రోడ్లపై వెళ్తున్న వారిపై రంగులు చల్లడం సరికాదని, ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని, పోలీసులు పూర్తి స్థాయిలో పెట్రోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. రంగుల్లో ఎలాంటి రసాయనాలను వాడకుండా చూడాలని సూచించారు.

క్లుప్తంగా

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


చిన్న కృష్ణ (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: వడదెబ్బకు గురై ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన ఎర్రవల్లి మండలంలోని వల్లూరులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిన్న కృష్ణ (50) శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ సమీపంలో ఉపాధి పనులకు వెళ్లారు. అక్కడ వడదెబ్బకు గురికావడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లి ఆర్‌ఎంపీకి చూపించారు. రాత్రి భోజనం చేసి నిద్రపోయాడని.. తెల్లారేసరికి మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య శకుంతలమ్మతో పాటు ఐదుగురు సంతానం ఉన్నారు. ఎంపీడీఓ అజహర్ మొహియుద్దీన్ వద్ద ప్రస్తావించగా.. ఉపాధి కూలీ మృతి చెందినట్లు తమకు సమాచారం వచ్చిందని.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

ఒంటిపై వేడినూనె పడి మూడేళ్ల చిన్నారి..


జయదేవ్ (ఫైల్)

వెల్దండ: ఒంటిపై వేడి నూనె పడి మూడేళ్ల చిన్నారి మృతిచెందాడు. ఈఘటన వెల్దండ మండలం బండోనిపల్లిలో తీవ్ర విషాదం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. బండోనిపల్లికి చెందిన ఏకుల అర్జున్, శారదమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వీరు జాతరల్లో స్వీట్లు తదితర తినుబండారాలు విక్రయించుకుని జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు వేంకటేశ్వరస్వామి జాతరలో స్వీట్లు విక్రయించేందుకు పిల్లలతో సహా వెళ్లారు. ఆదివారం జాతరలో స్వీట్లు తయారు చేస్తుండగా.. చిన్న కుమారుడు జయదేవ్ (3)పై ప్రమాదవశాత్తు వేడి నూనె పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కళ్ల ముందే చిన్నారి మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


చెరువులో మృతదేహం లభ్యం

బిజినేపల్లి: కర్ణాటక బళ్లారికి చెందిన చలపతి (40) మృతదేహం ఆదివారం మండలంలోని గంగారం గ్రామ చెరువులో లభ్యమైంది. స్థానికుల కథనం మేరకు.. గంగారం గ్రామానికి చెందిన ఆంజనేయులు వద్ద రాళ్లు కొట్టేందుకు చలపతి 5 నెలలుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు, ఆంజనేయులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గ్రామస్తులకు చెరువులో మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కొదండాపురం ఎస్‌ఐ స్వాతి ఆదివారం తెలిపారు. కొదండాపురం స్టేజీ వద్ద రెండు వర్గాలు గొడవ పడుతున్నట్లు సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు.. అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి యత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రిటైర్డ్ ఐఏఎస్ మృతి



నారాయణపేట రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, నారాయణపేట డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి తండ్రి, పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తాత కుంభం పుల్లారెడ్డి (92) ఆదివారం మృతిచెందారు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఆయన మరణవార్త విన్న నియోజకవర్గ ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌కు తరలివెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి పుల్లారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పుల్లారెడ్డి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎన్‌టీఆర్, మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వాల్లో కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రవ్యాప్తంగా జనతా హోటల్స్ ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు. అంత్యక్రియల్లో కలెక్టర్ చిట్టెం సుచరిత, మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, ఎర్రశేఖర్, గొంగడి సునీత, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ఏఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, నారాయణపేట డీఎస్పీ లింగయ్య, నాయకులు, ప్రజాప్రతినిధులు సదాశివరెడ్డి, బండి వేణుగోపాల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ఆలయానికి దారేది?


అలంపూర్‌లోని నవబ్రహ్మ ఆలయాల సముదాయం

- అనవసర నిర్మాణాలతో గుర్తుపట్టలేని స్థితిలో ప్రధాన ఆలయం
- ఏఎస్‌ఐ నిబంధనలకు విరుద్ధంగా రాతికట్టడాలు
- పట్టించుకోని పురావస్తు శాఖ

జోగుళాంబ శక్తిపీఠం: ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ) ఆధీనంలో ఉన్న అలంపూర్ నవబ్రహ్మ ఆలయాలు సహజ నిర్మాణశైలిని కోల్పోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన కట్టడాలు ఆలయ నైసర్గిక స్వరూపాన్ని మార్చివేశాయి. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం వద్ద అదనంగా నిర్మించిన నల్లరాతి కట్టడాలతో భక్తులు అయోమయానికి గురవుతున్నారు. ప్రధాన ఆలయాన్ని గుర్తించలేక తికమక పడుతున్నారు. ఇది ఇల్లా లేక ఆలయమా అనే విధంగా మారింది. ఇదే ప్రాంగణంలోని మిగతా ఎనిమిది ఆలయాలు కూడా బాలబ్రహ్మేశ్వర ఆలయ తరహాలోనే ఎర్రరాతితో నిర్మించబడ్డాయి. ఈ ఆలయాల ప్రధాన ముఖద్వారాలు భక్తులు చక్కగా గుర్తించేందుకు వీలుగా ఉన్నాయి. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం కూడా ఇదే తరహాలో నిర్మించినప్పటికీ.. ఆ తర్వాత కాలంలోని పాలకులు ప్రధాన ఆలయ ముఖద్వారాన్ని మరింత పెద్దదిగా నిర్మించేందుకుగాను ఎర్రరాతి మండపాలపై గరండాలు, నల్లబండలు వినియోగించారు. అంతటితో ఆగకుండా చుట్టూ గోడలు కట్టి, వాటికి తెల్లసున్నం వేశారు. దీంతో ప్రధాన ఆలయం భక్తులు గుర్తించలేని స్థితికి చేరింది.

ఏఎస్‌ఐ నిబంధనలకు విరుద్ధంగా..

ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ అనేక నిర్మాణాలు చోటుచేసుకున్నాయి. పూర్వపు నిర్మాణశైలిని నేటి తరానికి యథావిధిగా చూయించాల్సిన సంబంధిత శాఖ.. అదనపు నిర్మాణాలను తొలగించి, సహజ రూపాన్ని తీసుకురావడంపై దృష్టి సారించలేకపోతోంది. ఇక్కడ నిత్యం సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఏఎస్‌ఐ నిబంధనల మేరకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో ఆలయాల సహజ నిర్మాణశైలి పూర్తిగా కోల్పోయింది. 100 నుంచి 300 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు ఉన్నప్పటికీ.. వాటికి తూట్లు పొడిచి అనేక నిర్మాణాలు చేపట్టారు. అనవసర నిర్మాణాల తొలగింపుపై ఏఎస్‌ఐ వారు దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని యాత్రికులు అభిప్రాయపడుతున్నారు.

బండపరుపుపై ఉన్న శాసనాలేమిటి?

బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ప్రస్తుతం ఉన్న ఫ్లోరింగ్ బండపరుపులను తొలగిస్తున్నారు. బండల కింద ఎర్రబండ పరుపురాళ్లు అనేకం ఉన్నాయి. వాటిపై పలు శాసనాలు, చిత్రాలు కనిపిస్తున్నాయి. వీటిపై ఉన్న శాసనాలేమిటి.. ఆ చిత్రాల వెనుక ఉన్న మర్మమేమిటనే విషయాలను పురావస్తు శాఖ గుర్తించాల్సిన అవసరం ఉంది.



అనవసర నిర్మాణాలను తొలగించాలని కోరాం..



బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం ఎదుట ఉన్న నంది మండపం వద్ద అనవసరపు నిర్మాణాలతో భక్తులు ప్రధాన ఆలయాన్ని గుర్తించలేకపోతున్నారు. ఆలయం వద్దకు వచ్చి లోపలికి ఎలా వెళ్లాలని భక్త యాత్రికులు అడుగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో గమనించాలి. అనవసర నిర్మాణాలను తొలగించాలని ఏఎస్‌ఐ వారికి లేఖలు రాశాం. ఫోన్‌చేసి విజ్ఞప్తి చేస్తున్నాం.

– చిన్నకృష్ణయ్య, ఆలయ కమిటీ చైర్మన్

ఆలయ ముఖద్వారం గుర్తించలేకపోయాం..



ప్రధాన ఆలయ ముఖద్వారాన్ని గుర్తించలేకపోతున్నాం. ఆలయానికి ఓవైపు ఐరన్ గేటు, ఎదురుగా టికెట్ కౌంటర్ పేరిట రేకుల షెడ్డు ఉన్నాయి. దీంతో ఇది ఆలయ ముఖద్వారమా లేక.. టికెట్ కౌంటరా అని అర్థం కాలేదు. ఆలయం లోపలికి ఎలా వెళ్లాలని అక్కడున్న సిబ్బందిని అడగాల్సి వచ్చింది.

– సృజన, భక్తురాలు, హైదరాబాద్


ప్రధాన ఆలయ ముఖద్వారం కనిపించకుండా ఉన్న గోడలు


ఆలయంలో ఫ్లోరింగ్ బండలు తొలగిస్తున్న సిబ్బంది

సమయస్ఫూర్తితో నిలిచిన ప్రాణం

మాగనూర్: ఆ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఏదేని వాహనం రావాలంటే ఎక్కువ సమయం కావాల్సిందే. ఈక్రమంలో గ్రామానికి చెందిన ఓ యువకుడు గుండెపోటుకు గురయ్యాడు. అతడిని ఆస్పత్రికి తరలించేందుకు గ్రామస్తులు 108కు సమాచారం ఇచ్చారు. గ్రామానికి అంబులెన్స్ రావాలంటే ఎక్కువ సమయం పడుతుందని గమనించి, బాధిత యువకుడిని బైక్‌పై తీసుకెళ్లి సకాలంలో చికిత్స అందేలా చూడటంతో ప్రాణాలు నిలిచాయి. ఈఘటన మాగనూర్ మండలం పెగడబండలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేష్ ఆదివారం గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన అతడి స్నేహితుడు పరుశురాం 108కు సమాచారం అందించి, ద్విచక్ర వాహనంపై వడ్వాట్ గ్రామ సమీపం వరకు తీసుకొచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆ యువకుడికి ప్రథమ చికిత్స అందించి.. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్‌కు తరలించారు. పెగడబండ గ్రామ రోడ్డు గుంతలయమంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అత్యవసర సమయంలో వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.


వెంకటేష్‌కు చికిత్స అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

కొనుగోళ్లకు సన్నద్ధం

యాసంగి వరిధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం కసరత్తు


వానాకాలంలో పండించిన ధాన్యం సేకరణకు జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం (ఫైల్)

- జిల్లాలో 202 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- ఏప్రిల్ మూడో వారంలో కొనుగోళ్లను ప్రారంభించేందుకు సన్నాహాలు

నాగర్‌కర్నూల్: యాసంగి వరిధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. పంట దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. మరో 10 – 20 రోజుల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉన్నందున.. ఏప్రిల్ మూడో వారం నుంచి కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. జిల్లాలో 202 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గణనీయంగా పెరిగిన వరిసాగు..

జిల్లాలో వరిసాగు గణనీయంగా పెరిగింది. ఈ యాసంగిలో 1,55,553 ఎకరాల్లో వరిసాగు చేయగా.. 4.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల ద్వారా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గ్రేడు–ఏ రకం ధాన్యాన్ని రూ.2,203, రెండో రకాన్ని రూ.2,183 ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన తర్వాతే ధరను నిర్ణయిస్తారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్, వీఆర్‌ఓ, ఏఈఓతో ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

గత వానాకాలంలో నెరవేరని లక్ష్యం..

గత వానాకాలంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎక్కువ శాతం రైతులు ప్రైవేటు వైపే మొగ్గు చూపడంతో కొనుగోలు కేంద్రాల లక్ష్యం నెరవేరలేదు. జిల్లాలో సన్నరకాలపై రైతులు ఆసక్తి చూపడం.. సన్నరకాలకు ప్రభుత్వం ఇచ్చే ధర గిట్టుబాటు కాకపోవడంతో ప్రైవేటులోనే ధాన్యాన్ని విక్రయించారు. ధాన్యం సేకరణకు మొత్తం 230 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యం కాగా.. కేవలం లక్ష మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. ఇదిలా ఉంటే, కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది అందుబాటులో లేకపోవడం.. తేమ పేరుతో ధరలు తగ్గించడం.. ఇతరత్రా సమస్యలు ఉన్నాయని ఆరోపణలు వినిపించాయి. ఈ యాసంగిలో ఐకేపీ ద్వారా 178, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 20, మెప్మా ఆధ్వర్యంలో 4 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం..



రైతుల నుంచి ధాన్యం సేకరణకు 202 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు సిద్ధంచేశాం. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఏప్రిల్ మూడో వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

– స్వామికుమార్, డీఎస్‌ఓ

పత్తి మిల్లులో భారీ అగ్ని ప్రమాదం


షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన పత్తి విత్తనాలు

- సుమారు రూ.8 కోట్ల ఆస్తినష్టం
- విద్యుత్ షార్ట్‌సర్క్యూటే కారణంగా అనుమానం

మాగనూర్: నారాయణపేట జిల్లా మాగనూర్ మండలంలోని వడ్వాట్ పంచాయతీ యామన్‌దొడ్డి గ్రామ శివారులో శ్రీబసవేశ్వర జిన్నింగ్, ప్రెసింగ్ పత్తి మిల్లులో శనివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు గమనించి డయల్ 100తోపాటు అగ్నిమాపక సిబ్బంది, మిల్లు యజమానికి సమాచారం అందించారు. దీంతో నారాయణపేట, మక్తల్ నుంచి ఫైర్ ఇంజిన్లతో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో పత్తి బండల్స్, జిన్నింగ్ చేయడానికి తీసుకువచ్చిన విత్తనాలతోపాటు మిల్లులోని యంత్రాలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.8 కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు మిల్లు యజమాని దండే తమ్మన్న తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బంది అనుమానిస్తున్నారు. ఈ విషయమై మిల్లు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాగనూర్ ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపారు.


మిల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మిల్లును పరిశీలించిన ఎమ్మెల్యే

అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం ఉదయం మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇప్పుడిప్పుడే ఇండస్ట్రియల్‌గా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇంత పెద్ద అగ్ని ప్రమాదం సంభవించడం బాధాకరమన్నారు. ప్రమాదంలో నష్టపోయిన మిల్లు యజమానిని అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సంఘటనా స్థలం నుంచే కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, వైస్ ఎంపీపీ తిప్పయ్య, నాయకులు శివరాంరెడ్డి, రాఘవరెడ్డి, రవీందర్ తదితరులున్నారు.

ఆయిల్ ప్లాంట్ దగ్ధం



చెరుకుపల్లి ఆగ్రో ప్రొడక్ట్స్‌లో చెలరేగుతున్న మంటలు,అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ట్రాక్టర్

- కాలిబూడిదైన షెడ్, యంత్రాలు, ఓ రైతు ట్రాక్టర్
- రూ.2 కోట్ల మేర ఆస్తినష్టం

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్ శివారులోని చెరుకుపల్లి ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆయిల్ మిల్ సాల్వెన్ ప్లాంట్ కాలి బూడిదైంది. గోడౌన్‌లో తౌడు నూనెకు సంబంధించి పెద్దఎత్తున సామగ్రి ఉండగా.. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ప్రమాదం చోటుచేసుకుంది. చెరుకుపల్లి గోడౌన్ పక్కనే ఉన్న ప్యానల్ బోర్డు వైర్లు డిస్‌కనెక్ట్ అయి షార్ట్‌సర్క్యూట్ జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. గోడౌన్‌లో పనిచేసే కార్మికులు యజమానికి సమాచారం చేరవేశారు. ప్లాంట్ యజమాని చెరుకుపల్లి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి.. అగ్నిమాపక వాహనాలు జడ్చర్ల, మహబూబ్‌నగర్ నుంచి ఒక్కొక్కటి చొప్పున ఇక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాదంలో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో గోడౌన్‌లోని యంత్రాలతోపాటు షెడ్, పైభాగంలో ఉన్న సోలార్ ప్యానల్ పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే ప్లాంట్ ఆవరణలో నిలిపిన ఓ రైతు ట్రాక్టర్ కూడా అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఊహించని రీతిలో జరిగిన ఈ ప్రమాదంతో దాదాపు రూ.2 కోట్ల వరకు నష్టం జరిగినట్లు బాధిత యజమాని చెరుకుపల్లి రాజేశ్వర్ తెలిపారు.

ఈత చెట్లు దగ్ధం

తెలకపల్లి: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఈతచెట్లు దగ్ధమైన ఘటన తెలకపల్లి మండలం దాసుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు కృష్ణమూర్తి, జగన్మోహన్‌గౌడ్ వివరాల మేరకు.. దాసుపల్లికి చెందిన రాంరెడ్డి గ్రామ సమీపంలో ఈతచెట్ల తోట సాగుచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పివేశారు. అప్పటికే 25 చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో బాధితుడికి రూ. 80వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇంట్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న సీఐ చంద్రశేఖర్

మక్తల్: గుర్తుతెలియని దుండగులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మక్తల్ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాఘవేంద్ర కాలనీకి చెందిన మన్యంకొండ ఉక్కపోత కారణంగా ఆదివారం రాత్రి ఇంటి డోర్ తెరిచి నిద్రించారు. తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి.. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం ఆభరణాలను చోరీ చేశారు. ఉదయం చోరీ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

2 ద్విచక్ర వాహనాలు ఢీ : వ్యక్తి మృతి

చిన్నచింతకుంట: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని అల్లీపురం సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆర్.శేఖర్ కథనం మేరకు.. మండలానికి చెందిన దౌలత్ (50) భార్య తల్లిగారి ఊరైన ఆత్మకూర్ మండలం బాలకిష్టాపురం గ్రామానికి వెళ్లింది. ఆమెను తీసుకొచ్చేందుకు సాయంత్రం వేళ బైక్‌పై బయలుదేరాడు. మండలంలోని అల్లీపురం గ్రామ సమీపంలోకి రాగానే ఆత్మకూర్ నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో దౌలత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దౌలత్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా...

మేకా శరణ్ లావాదేవీలపై ప్రశ్నలు

రేపు రౌజ్ అవెన్యూ కోర్టులో కవితను ప్రవేశపెట్టనున్న ఈడీ అధికారులు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విచారణ కొనసాగుతోంది. ఆదివారం ఎనిమిదో రోజూ కవితను ఈడీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా తెరపైకి వచ్చిన మేనల్లుడు మేకా శరణ్ వ్యాపార లావాదేవీలకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. విచారణకు సహకరించాలని వాస్తవాలు వెల్లడించాలని కవితకు సూచించినట్లు సమాచారం. మద్యం విధానానికి సంబంధించిన అంశాలు శరణ్ ఫోనులో ఎందుకున్నాయి? ఈ కుంభకోణంలో శరణ్ ప్రమేయం ఏంటి? అనే అంశాలపై కవిత నుంచి ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కస్టడీ అనంతరం ఈ నెల 26న రౌజ్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు కవితను ప్రవేశపెట్టనున్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



అనంతగిరి: వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమ్మరిపల్లి జంగయ్య (50)కు కొంత పొలం ఉంది. దాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యక్తిగత అవసరాల కోసం జంగయ్య పొలాన్ని అదే గ్రామానికి చెందిన నర్సింహులుకు ఏజీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేశారు. ఆ భూమిని తిరిగి ఇవ్వాలని జంగయ్య కోరగా ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో దీనిపై చాలాసార్లు పంచాయితీలు పెట్టారు. పంచాయితీలో జంగయ్య పేరు మీదకు మార్చి ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన జంగయ్య శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

గురుకుల బోర్డుకు కొత్త సారథులు!

కన్వీనర్‌గా ఉన్న బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బదిలీతో మార్పులు అనివార్యం

- మల్లయ్య బట్టు స్థానంలో కార్యదర్శిగా బి.సైదులు నియామకం
- సైదులు అందరికంటే సీనియర్ కావడంతో చైర్మన్ మస్రత్ ఖానమ్‌కు స్థానచలనం?
- ఈ నేపథ్యంలోనే చైర్మన్, కన్వీనర్‌గా కొత్తవారికి చాన్స్!
- త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ)లో మార్పులు జరగనున్నాయి. కీలకమైన చైర్మన్, కన్వీనర్ పోస్టుల్లో త్వరలోనే కొత్తవారిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి, టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్‌గా ఉన్న మల్లయ్య బట్టును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీచేసింది. సొసైటీ నూతన కార్యదర్శిగా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులను నియమించింది. దీంతో గత వారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్‌గా వ్యవహరించిన మల్లయ్య బట్టు ఆ బాధ్యతల నుంచి కూడా తప్పుకోవడంతో కన్వీనర్ సీటు ఖాళీ అయ్యింది. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అత్యంత కీలకంగా వ్యవహరించే కన్వీనర్ సీటు ఖాళీ కావడంతో బోర్డు పరిధిలో పలు నియామకాలకు సంబంధించిన అంశాలు పెండింగ్‌లో పడిపోయాయి. ఈ క్రమంలో వాటి భర్తీతో పాటు ఇతర కీలక నిర్ణయాలు తీసుకోవాలంటే బోర్డుకు కన్వీనర్ నియామకం అనివార్యం కానుంది.

బోర్డు సభ్యులుగా సొసైటీల కార్యదర్శులు

రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీని వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా టీఆర్ఈఐఆర్‌బీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్)లతో పాటు విద్యాశాఖ పరిధిలో కొనసాగుతున్న తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఆర్ఈఐఎస్)ల కార్యదర్శులు బోర్డులో సభ్యులుగా ఉంటారు. గురుకుల సొసైటీల్లో సీనియర్ కార్యదర్శి ఈ బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో సభ్యుడు కన్వీనర్‌గా ఉంటారు. బోర్డు సభ్యుల అంగీకారం, ప్రభుత్వ ఆమోదంతో సొసైటీల్లోని అదనపు కార్యదర్శుల్లో ఎవరినైనా కూడా కన్వీనర్/ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించుకోవచ్చు.

ప్రస్తుత చైర్మన్‌గా ఆయేషా మస్రత్ ఖానమ్

ప్రస్తుతం బోర్డు చైర్మన్‌గా మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖానమ్ ఉన్నారు. కన్వీనర్‌గా కొనసాగిన మల్లయ్య బట్టును టీఎస్ఈడబ్ల్యూఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్, సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలోనే ఆయన అక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా బి.సైదులు నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న గురుకుల సొసైటీ కార్యదర్శుల్లో ఈయనే సీనియర్ అధికారి. బోర్డు చైర్మన్‌గా సీనియర్ అధికారిని నియమించాల్సి ఉండటంతో ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న మస్రత్ ఖానమ్‌కు కూడా స్థాన చలనం తప్పదని అధికారులు అంటున్నారు. కన్వీనర్ పోస్టు కూడా ఖాళీ కావడంతో చైర్మన్, కన్వీనర్ రెండు పోస్టుల్లోనూ కొత్త వారినే నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బోర్డు అధికారులు ఒకట్రెండు రోజుల్లో సొసైటీ కార్యదర్శుల సీనియార్టీ, తదితర పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలు పరిశీలించిన తర్వాత చైర్మన్, కన్వీనర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

పీవీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి



ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

నాగోలు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ఎంతో సంతోషకరమని కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం, మహిళ దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేణు గోపాలచారి మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ పీవీ నరసింహారావు స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా సురభి వాణీదేవి, కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బసవరాజు శ్రీనివాస్, వైష్ణవి ప్రసాద్‌లు మాట్లాడారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించి డాక్టర్ సూరి, అనంతలక్ష్మి, మాంధాత, నిష్పాని రుక్మిణిలను సత్కరించారు.

గ్యాంగ్‌స్టర్ నయీం కేసులోనూ తిరుపతన్న

ఫోన్ ట్యాపింగ్ అధికారులిద్దరూ హోం శాఖ మెడల్స్ పొందినవారే..

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు అరెస్టు చేసిన మేకల తిరుపతన్న పేరు 2017లోనూ ఓసారి వివాదాస్పదంగా వార్తల్లోకి ఎక్కింది. షాద్‌నగర్‌లో 2016లో జరిగిన గ్యాంగ్‌స్టర్ నయీం సంబంధిత కేసుల దర్యాప్తు కోసం అప్పట్లో ఓ సిట్‌ను వేశారు. నయీం వ్యవహారాలను అన్ని కోణాల్లోనూ, ఆద్యంతం ఆరా తీసిన సిట్ అధికారులు అతడితో అంటకాగిన దాదాపు 40 మంది పోలీసులను గుర్తించారు. ఈ మేరకు 2017లో అప్పటి డీజీపీ అనురాగ్ శర్మకు సిట్ నివేదిక ఇచ్చింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న డీజీపీ ఐదుగురిని సస్పెండ్ చేస్తూ, మిగిలిన వారిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తూ 2017 మే 12న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విచారణ ఎదుర్కొన్న అధికారుల్లో అప్పట్లో డీఎస్పీ హోదాలో ఉన్న మేకల తిరుపతన్న కూడా ఉన్నారు. ఈ కేసు నుంచి బయటపడిన తిరుపతన్న పదోన్నతి సైతం పొందారు. ప్రస్తుతం అదనపు ఎస్పీ హోదాలో ఉన్న తిరుపతన్న గతంలో పంజాగుట్ట ఏసీపీగానూ పని చేశారు. ఇటీవలే హైదరాబాద్ నగర భద్రత విభాగానికి (సీఎస్‌డబ్ల్యూ) అదనపు డీసీపీగా బదిలీపై వచ్చారు. తిరుపతన్నకు గత ఏడాది స్వాతంత్ర దినోత్సవం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి యూనియన్ హోం మినిస్ట్రీ మెడల్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ లభించింది. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి అదనపు ఎస్పీగా పనిచేస్తున్న నాయిని భుజంగరావు గతంలో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ఈయనకూ 2021లో యూనియన్ హోం మినిస్ట్రీ మెడల్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్వెస్టిగేషన్ లభించింది.

ట్యాపింగ్ కేసులో ముగ్గురికి రిమాండ్

▶ మొదటి పేజీ తరువాయి

మందికి సిట్ నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచింది. ఈ కేసులో ప్రధానాంశం ఫోన్ ట్యాపింగ్ కావడంతో 'టెలిగ్రాఫిక్ యాక్ట్'ను కూడా జోడించాలని అధికారులు నిర్ణయించారు.

ముగ్గురి కోసం లుకౌట్ సర్క్యులర్

పంజగుట్టలో నమోదైన ఈ ట్యాపింగ్ కేసులో శనివారం వరకు ప్రణీత్‌రావు మాత్రమే నిందితుడిగా ఉండేవారు. సిట్ దర్యాప్తు, ప్రణీత్‌రావు వెల్లడించిన అంశాల ఆధారంగా భుజంగరావు, తిరుపతన్నలను కూడా నిందితులుగా చేర్చినట్లు సిట్ కోర్టుకు తెలిపింది. వీరితోపాటు ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు, ఓ మీడియా సంస్థ అధి పతిని కూడా నిందితులుగా చేర్చినా.. విదేశాల్లో తలదాచుకున్నారు. దీంతో ఆ ముగ్గురి కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవులకు అధికారులు లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు.

వ్యక్తిగత జీవితాలూ 'ట్యాప్'..

విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్లతో ల్యాండ్‌లైన్లు, సెల్‌ఫోన్ కాల్స్‌తోపాటు సోషల్‌మీడియాను ట్యాప్ చేసిన 'ప్రభాకర్‌రావు టీమ్'.. బెదిరింపు వసూళ్లకు పాల్పడటంతోపాటు కొందరి వ్యక్తిగత జీవితాలపైనా నిఘా పెట్టినట్టు తెలిసింది. హైప్రొఫైల్ వ్యక్తుల అంతర్గత వ్యవహారాలను ట్యాపింగ్ ద్వారా తెలుసుకుని.. వారికి ఆ వాయిస్‌లు, సందేశాలు చూపి, భారీ డిమాండ్లు నెరవేర్చుకున్నట్టు సమాచారం. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులతోపాటు కొందరు పోలీసు ఉన్నతాధికారులు, బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు, కీలక వ్యక్తులపైనా ట్యాపింగ్ నిఘా పెట్టినట్టు తెలిసింది.

ప్రభాకర్‌రావుకు ఊహించిన షాక్..

ప్రస్తుతం అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్‌రావు నుంచి ఇక్కడి ఓ పోలీసు ఉన్నతాధికారికి కాల్ వచ్చినట్టు తెలిసింది. ఇప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు మీరు ఎలా ట్యాపింగ్ కేసులో దూకుడుగా వెళ్తున్నారో.. అప్పటి ప్రభుత్వ ఒత్తిడితోనే తాను ట్యాపింగ్‌లో జోక్యం చేసుకున్నానని ఆయన చెప్పినట్టు సమాచారం. మనం మనం పోలీసులమేనని, కేసు దర్యాప్తు పేరుతో ఇళ్లలో సోదాలు చేయడమేంటని కూడా ప్రభాకర్‌రావు పేర్కొన్నట్టు తెలిసింది. తాను వైద్యం కోసమే అమెరికా వచ్చానని, జూన్ లేదా జూలైలో తిరిగి వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పినట్టు సమాచారం. ఇదంతా విన్న సదరు ఉన్నతాధికారి.. ''మీరు ఏం చెప్పాలనుకున్నా, ప్రశ్నించాలనుకున్నా నా అధికారిక మెయిల్ ఐడీకి ఈ–మెయిల్ పంపండి. అప్పుడే నేను ఎలాంటి సమాధానం ఇవ్వాలో అలాంటి సమాధానం ఇస్తా..'' అని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీనితో ప్రభాకర్‌రావు మౌనంగా ఫోన్ కట్ చేసినట్టు సమాచారం.

ట్యాపింగ్ కేసులో ఇద్దరు కీలక నేతలు?

భుజంగరావును శనివారం అరెస్టు చేసిన సిట్ అధికారులు.. ఆయన నుంచి ఫోన్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆయనను విచారించిన సమయంలో, ఉపకరణాల విశ్లేషణలో సిట్ అధికారులకు కీలక సమాచారం లభించినట్టు తెలిసింది. ట్యాపింగ్ చేయాల్సిన టార్గెట్ల వివరాలు ఆయనకు నేరుగా ఓ ముఖ్య నేత నుంచి వచ్చినట్టు తేలింది. డీఎస్పీ ప్రణీత్‌రావుకు మరో కీలక నేత నుంచి ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. ఆ నేతల పాత్రకు సంబంధించి పలు ఆధారాలు లభించిన నేపథ్యంలో.. కేసులో వారి పేర్లను చేర్చాలని సిట్ నిర్ణయించినట్టు తెలిసింది. తొలుత సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయాలని, వారి స్పందన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం.

సిట్ దర్యాప్తునకు కొన్ని ఆటంకాలు!


అక్రమ ట్యాపింగ్ వ్యవహారం మూలాలు బయటపడాలన్నా, సూత్రధారులను తేల్చాలన్నా సాంకేతిక ఆధారాలు కీలకం. అందుకే వాటిని సేకరించడానికి సిట్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే ఓ నిఘా విభాగం నుంచి నగర పోలీసులకు సరైన సహకారం అందట్లేదని తెలిసింది. అందుకే దర్యాప్తు జాప్యం అవుతోందని సమాచారం. కేసు దర్యాప్తు కోసం అధికారులు అడిగిన పలు సున్నిత అంశాలు తెలపడానికి, ఉపకరణాల విశ్లేషణ కోసం సదరు నిఘా విభాగం అధికారి అనుమతించట్లేదని తెలిసింది. పోలీసులు వచ్చి తమ విభాగంలో అంశాలన్నీ పరిశీలిస్తే.. బయటి ప్రపంచానికి తెలిసిపోతాయని, తద్వారా వ్యూహాలు దెబ్బతింటాయని చెప్తున్నట్టు సమాచారం. భవిష్యత్తులో జాతీయ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తాము కీలక ఆపరేషన్లు చేపట్టలేమని సదరు అధికారి పేర్కొంటున్నట్టు తెలిసింది. దీంతో సిట్ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

కూలి పెంపునకు బీడీ కార్మికులు ఉద్యమించాలి



చిన్నచింతకుంట: కూలి పెంపునకు బీడీ కార్మికులంతా ఏకమై ఉద్యమించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన బీడీ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్మికులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యానికి డిమాండ్ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పనికి తగిన కూలి అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. వెయ్యి బీడీలు చుడితే కేవలం రూ.207 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఒప్పందం ప్రకారం రెండేళ్లకు ఓసారి కూలి రేటు పెంచాల్సి ఉందని.. ఆ గడువు ఈ నెల 30న ముగుస్తుందని పేర్కొన్నారు. ఇక నుంచి వెయ్యి బీడీలకు రూ.376 కూలి చెల్లించి ఆదుకోవాలన్నారని కోరారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, కేపీఎంపీఎస్ జాతీయ కన్వీనర్ బండారు లక్ష్మయ్య, కార్మికులు మహేందర్, జింకల రాజు, శంకర్, లక్ష్మన్న, ఘట్టన్న, కురుమన్న, నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పంబ అరట్టు



స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి పంబ అరట్టు (స్వామివారికి చక్రస్నానం) వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక మయూరీ నర్సరీ సమీపంలోని ఊటశెలిమి శివాలయంలో గణపతిపూజ, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకం, శోడష ఉపచార పూజ, చక్రస్నానం, వరుణ పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు, పడిపూజ నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ముందుగా రైల్వేస్టేషన్ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సుప్రభాతసేవ, అభిషేకం, అలంకరణ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే, ఏపీ అధ్యక్షుడు వాసుగురుస్వామి, కార్యదర్శి హరినారాయణ్‌స్వామి, జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, రఘుపతిశర్మ, శ్రవణ్‌కుమార్‌శర్మ, మనోహర్, జనార్దన్, రామేశ్వర్, ఈశ్వర్, మోనేష్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రంగనాథుడి రథోత్సవం

- భారీగా తరలొచ్చిన భక్తజనం
- మార్మోగిన గోవింద నామస్మరణ



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో..) ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి మూలవిరాట్

పెబ్బేరు రూరల్: అశేష జనవాహిని మధ్య శ్రీరంగాపురం రంగనాథస్వామి రథోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవానికి వనపర్తి సంస్థానాధీశుడు, ఆలయ వంశపారంపర ధర్మకర్త రాజా కృష్ణదేవరావు, ఆయన కుమారుడు ఆరుద్రదేవ్ హాజరు కాగా.. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికి, ప్రత్యేకార్చనలు జరిపించారు. ప్రధాన అర్చకుడు విష్ణునారాయణశర్మ పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్లు రథంపై కొలువుదీరగా.. సంస్థానాధీశుడు రాజా కృష్ణదేవరావు కొబ్బరికాయ కొట్టి, రథాన్ని ప్రారంభించారు. సంస్థానాధీశులతో పాటు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి , ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి భక్తులతో కలిసి గోదాదేవి ఆలయం వరకు రథాన్ని లాగారు. ఈసందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. సాయంత్రం అక్కడి నుంచి రథాన్ని తిరిగి ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. రథంలో ఊరేగుతున్న రంగనాథుడిని భక్తులు దర్శించుకుని తన్మయం చెందారు. శ్రీరంగాపురం సేవాసమితి సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. మంగళి నారాయణ్‌దాస్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. జాతరలో ఏర్పాటు చేసిన మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ రాంబాబు, ఎస్ఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న వనపర్తి సంస్థానాధీశుడు రాజా కృష్ణదేవరావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన



వాకర్లతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ప్రభుత్వ డైట్ కళాశాల, ఎంవీఎస్ కళాశాల మైదానంలో వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. వాకర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేటప్పుడూ కొంత ఇబ్బందులు ఉన్నాయని వాకర్లు వంశీచంద్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌కు చెప్పడంతో వీలైనంత త్వరగా మైదానంలో లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తనను ఆశీర్వదించి గెలిపిస్తే మీ అందరి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేల సహకారంతో కులమతాల అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా పనిచేసినా ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదని, మచ్చలేని రాజకీయ నాయకుడిగా ఎదుగుతున్నానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి గెలిపిస్తే దళిత, గిరిజన, బడుగు, బలహీన మైనార్టీ వర్గాలకు సముచితస్థానం, గౌరవం పెంపొందించే విధంగా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, ఫయాజ్, ఆంజనేయులు, అజ్మత్‌అలీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

18వ శతాబ్దం నాటి శివలింగం గుర్తింపు



వేంకటేశ్వరస్వామి గుట్టపై శివలింగం ఆనవాళ్లను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి తదితరులు

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని పెద్దపల్లి శ్రీబుగ్గ వేంకటేశ్వరస్వామి గుట్టపై 18వ శతాబ్దం నాటి శివలింగం ఆనవాళ్లను పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఆదివారం ఆయన గ్రామస్తులతో కలిసి గుట్టను సందర్శించారు. వేంకటేశ్వరిస్వామి దేవాలయం వద్ద క్రీ.శ. 8వ శతాబ్దం నాటి శివలింగ ఆనవాళ్లను పరిశీలించారు. ఇది రాష్ట్ర కూటుల కాలం నాటి శివలింగం అని దానిని కాపాడుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ప్రముఖ కవులు వనపట్ల సుబ్బయ్య, దినకర్‌రావు ఇచ్చిన సమాచారం మేరకు వేంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులపై పరిసరాలను పరిశీలిస్తుండగా రాతిని తొలచి మలిచిన 5 అడుగుల వ్యాసంతో పానవటం మధ్యలో శివలింగాన్ని ప్రతిష్ఠించడం కోసం అడుగు వ్యాసంలో 6 అంగులాల లోతు గుంత చెక్కారని పేర్కొన్నారు. శిల్ప శైలిని బట్టి ఈ శివలింగం పానవటం 1200 సంవత్సరం నాటిదని, 8వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాష్ట్ర కూటుల కాలానికి చెందినదని, దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే గుట్టపై 200 సంవత్సరాల నాటి శాసనం కూడా చెక్కబడి ఉందని, అందులో దేవేంద్రపురికి సంబంధించిన మునీశ్వరుని శిష్యులైన ఉపేంద్రపురి విశ్వనాథుల ప్రస్తావన ఉందన్నారు. వీరిద్దరు ఇక్కడ సిద్ధి పొందారని చెప్పారు. ఇంకా పురాతన ఆనవాళ్లు ఉన్నాయని ఇలాంటి ప్రాచీన కళాసంపదను కాపాడుకోవాలని చెప్పారు. ఆయన వెంట పెద్దపల్లి గ్రామస్తులు సురభి, సత్యపాల్‌రావు, కేశవులుగౌడ్, దర్శి, రాజయ్య, కందూరు లక్ష్మణస్వామి, బాలస్వామిగౌడ్, అర్చకులు వంశీకృష్ణ, స్తపతి, భీంరెడ్డి, వెంకట్‌రెడ్డి, శిల్పి ఎల్లయ్య, బ్రహ్మాచారి తదితరులు ఉన్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన రామలింగేశ్వరుడు



అశ్వవాహనంపై ఊరేగుతున్న రామలింగేశ్వరస్వామి



హోమం నిర్వహిస్తున్న పండితులు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో స్వయంభూ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం అర్ధరాత్రి తర్వాత స్వామి వారికి అశ్వవాహనసేవ నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి ఉత్సవమూర్తి అశ్వవాహనంపై కొలువుదీరగా.. పండితులు హోమం నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. ఆదివారం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న స్వామివారి వెండి ముఖం, నాగపడగలను పల్లకీలో ఆలయానికి తీసుకొచ్చారు. ప్రధాన ఆలయంలో రామలింగేశస్వామికి వాటిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావు పాల్గొన్నారు.